'నన్ను బహిష్కరించిన ఆసంఘమే నన్ను చాటుమాటున పోషించింది.'

# మొగమహారాజులు

"నన్ను పాడుచేయాలని చూచిన పాపిష్టి లోకమే నన్ను వ్యభిచారిణి, భోగంది అని పిలిచింది. ఉపన్యాసాల్లోనూ, పుస్తకాల్లోనూ నన్ను దూషించినవాళ్లే నన్ను రహస్యంగా పొగడేవారు."

రచయిత:
## మద్దాల తాతాజీరావు

౧

మొన్న వేసవికాలంలో చిన్న పని మీద పట్టణం వెళ్లేను. సాయంకాలం అయిదుగంటలు పైనే కావస్తుంది. ఇంకా గాడ్పు కొడుతూనేవుంది. బీచి వైపుకు షికారుగ బయలుదేరేను. ఏదో ఆలోచిస్తూ చాలదూరం నడిచిపోయాను. కొంతసేపటికి దాహం వేసింది. దగ్గరలో యెక్కడా షోడాషాపు కనబడలేదు. పోనీ, మంచినీళ్ళయినా తాగుదామని దగ్గరగఉన్న యింటికి వెళ్లేను. అదొక చిన్న బంగళా. లోపల గుమ్మందగ్గర ఒకావిడ కూర్చుంది. వయస్సు మళ్ళింది కాని ముసలావిడకాదు. "ఏమమ్మా, కొంచెం మంచినీళ్లు దొరుకుతాయా?" అన్నాను గొంతుక తడుముతూ. "అదెంతభాగ్యం, నాయనా!"అని అరుగు మీదఉన్న కుర్చీలో కూర్చోమని చెప్పి మంచినీళ్లు తెచ్చియిచ్చింది. 'ఈమహాపట్టణంలో యింత ఆదరంగా చూస్తున్న యీావిడ యెవరా' అనుకున్నాను. వెంటనే వెళ్ళిపోతే బాగుండదు.

రెండుముక్కలు మాట్లాడిపోదామని "మీకాపురస్థలం ఏవూరండీ?" అన్నాను.

"చాలదూరంవుంది, నాయనా! మాదొక పల్లెటూరు" అందావిడ.

"మీరొక్కరేవుంటున్నట్టున్నారే యీయింట్లోను" అన్నాను.

"అవును. నాయనా! నేను ఒక్కదాన్నే. ఏంచెప్పను? నాదొక అభాగ్య జీవితం. తలుచుకుంటే గుండె తరుక్కుపోతుంది" అంది పాపం యెంతో దీనంగా.

సంభాషణ మొదలెట్టినందుకు కూరికే పోలేదనుకుని "అవునమ్మా, కష్టాలు అందరికీ కలుగుతాయి. మనబాధలు యితరులకు చెప్పుకుంటే హృదయభారం కూడా తగ్గుతుంది. నీజీవితగాథ వినాలనుంది నాకు" అన్నాను.

ఆవిడ చెప్పటం మొదలుపెట్టింది:

"అయిదేళ్లు కాపురంచేసిన తర్వాత నాభర్త చనిపోయాడు. అప్పటికి నాకు యిరవైరెండో, యిరవైమూడో ఉంటాయి. మాపుట్టింటివాళ్లెవరూ లేకపోవడంచేత అత్తవారింటిదగ్గరే ఉండిపోయాను. మామామగారు, నాతోడికోడలు, నేను ఉండేవాళ్ళం ఒకయింట్లో. వాళ్లు నన్ను మొదటినుండీ వాళ్ళింట్లో దాసీదానిలాగ చూడటం మొదలెట్టారు. రోజంతా చచ్చిచెడి పనిచేసేదాన్ని. కుక్కకంటే నీచంగా చూసేవారంటే నమ్ము,నాయనా! ఓపికతో రెండు సంవత్సరాలు భరించాను. ఇంక ఆయింట్లో ఉండటం దుర్లభమైపోయింది.

ఒకరోజున తెగించి మాతోడికోడలుతో "అక్కయ్యా! నేను వచ్చిందగ్గర నుండి మీకూ సుఖంలేదు. నాకూ సుఖంలేదు. నాకేదన్నా వేరే యేర్పాటుచేస్తే బాగుంటుం"దన్నాను.

ఎక్కడవిన్నాడో మాబావగారొచ్చి "ఏంటి యేర్పాటుచేసేది, పడుపువృత్తి చేసుకోరాదూ, కావలసినంత డబ్బు" అన్నాడు.

ఆమాటలు వినగానే నామీద పిడుగు పడినట్లయింది. వాళ్లెంత కష్టపెట్టినా, ఆయనంటే నాకు కొంచెం గౌరవముండేది. దాంతో నాకు అసహ్యంవేసింది. తెగించి నాభర్తకు రావలసినభాగం ప

చిపెట్టమని అడిగాను. వెంటనే నన్ను వీధిలోకి గెంటేశారు.

ఆవీధిలోగాని, ఆవూళ్లోగాని నాతరఫున మాట్లాడేవారే లేకపోయారు. దిక్కులేనిదాన్ని వీధిలోకి గెంటేస్తే పెద్దలందరు తమకు తెలియనట్లుగానే ఊరుకున్నారు.

"అయితే కోర్టులో దావా చెయ్యకపోయారే" అన్నాను.

"అయ్యో! పిచ్చివాయనా! డబ్బున్నవాళ్ళకి కోర్టులూ, న్యాయంగాని, దమ్మిడీలేని నాకు కోర్టులో న్యాయం దొరుకుతుందా? సరే, ఆవేళే ఆవూరువదలి రాత్రంతా ఊరుబయటనే గడిపాను. తిండిలేదు, ఆకలి దహించేస్తుంది. ఎందులోనన్నా పడి చచ్చిపోదామనుకున్నాను. కాని ధైర్యంచాలిందికాదు. అడుక్కుని బ్రదుకుదామా అంటే నీచమనిపించింది. కష్టపడి జీవనోపాధి గడించడం గౌరవమేకాని మానహీనం కాదనుకున్నాను.

౨

ఎవరింట్లోనన్నా పనిచేసి బ్రదుకుదామనుకుని, దగ్గరగా ఉన్నపట్టణంవెళ్ళి ఒక డాక్టరిగారింట్లో పనిచేసేందుకు కుదిరాను. భోజనంపెట్టి నెలకు 10 రూపాయిలు యివ్వడానికి యేర్పాటయింది. డాక్టరుగారి పిల్లల్ని చూడటం, వంట చెయ్యడం యిదీ నాపని. కొన్నిమాసాలయిన తర్వాత డాక్టరుగారిభార్య పురుటికి పుట్టింటి కెళ్ళింది. డాక్టరుగారికి నామీద కామంకలిగింది. నన్ను బలవంతపెట్టేడు. నేను తిరస్కరించాను. ప్రాణంకన్నా మానంయెక్కువగా చూసుకునేదాన్ని. అమర్నాడే నన్ను పనిమానిపించేశారు, ఆడాక్టరు మహాశయులు. మళ్ళీ పొట్టచేత్తో పట్టుకుని తిరగటం ప్రారంభించాను పనికోసం.

౩

ఆపట్టణంలోనే ఒక పెద్ద మిల్లు ఉంది. మేనేజరుగారిదగ్గరకెళ్ళి మిల్లులో పని ఇప్పించమని అడగ్గానే ఆయన ఒప్పుకున్నాడు. ఒక వారంరోజులు పనిచేసేను. కర్మవశాత్తూ ఆ మేనేజరుకు కూడా నామీద కామప్రవృత్తి కలిగింది. ఆయనకోర్కెకు సమ్మతిస్తే నేను మిల్లులో పనిచేయవలసిన అవసరం ఉండదనీ, యెంతో సుఖపెడతాననీ ఆశలుపెట్టాడు. సమ్మతించకపోతే మిల్లులో పనిచేయటానికి వీలులేదని కూడా చెప్పాడు. అమరునాడే ఆమిల్లువదిలేశాను.

"నాకు ప్రపంచంమీద అసహ్యం కలిగింది. నీతికి న్యాయానికి తావులేదనిపించింది. నాశరీరాన్ని, యౌవనాన్ని ఆశించేవాళ్ళేగాని, నాసేవను లెక్కచేసేవాళ్లు లేరనుకున్నాను. మగవాళ్ళ దౌర్జన్యం యిలావుందికదా అనిపించింది. నాకొక మొండిధైర్యం కలిగింది. మగవాళ్ళకు తగిన ప్రతీకారం చేయాలనుకున్నాను.

తిన్నగా ఈ పట్టణంవచ్చి 'వ్యభిచారవృత్తి ప్రారంభించేను. నాకు కావలసినంత డబ్బువచ్చేది. అప్పుడే యీ బంగళా కట్టించాను. నన్ను పాడుచేయాలనిచూసిన పాపిష్టిలోకమే నన్ను వ్యభిచారిణి, భోగంది అని పిలిచింది. ఆ సంఘమే నన్ను బహిష్కరించి, నీచంగాచూసి, చాటుమాటున నన్ను పోషించింది. ఉపన్యాసాల్లోను, పుస్తకాల్లోను నన్ను దూషించినవాళ్ళే నన్ను రహస్యంగా పొగడేవారు. సంఘ ధర్మకర్తలు, నీతి నియమాలకు అవతారాలు అనబడే పెద్ద, పెద్దలే నాకు పాదాక్రాంతు లయ్యారు.

మగజాతిమీద పగతీర్చుకున్నానన్న సంతుష్టికలిగింది నాకు. నాజీవితానికి కావలసిన ధనం ఉంచుకొని, మిగిలింది బీదసాదలకు దానంచేశాను. నేను చచ్చిపోయేముందు ఈబంగళా వితంతుశరణాలయంవారికి దానంచేస్తాను. ఇది, నాయనా! నావిషాద గాథ. పాపం, చాలసేపుకూర్చుని ఓపికతో విన్నావు" అంటావిడ యెంతో దయతో.

"అయితే, నీదుఃఖజీవితానికి ఎవరు సిగ్గుపడాలంటావు" అన్నాను యేమి చెపుతుందో అని.

"మొగమహారాజులందరూ" అంది మొగవాళ్ళని జయించానన్నగర్వంతో.


ముందుజరగబోయే మీజీవితము
ఎట్లా ఉన్నది ?
రాఘవాచార్యులగారు చెప్పతారు.

జాతకము అవసరములేదు జన్మతేది అవసరములేదు రెండు అరచేతులు ముద్రలుగాని మీఫోటోగాని పంపండి మీపూర్తి జీవితమును, మీప్రశ్నలకు చక్కని జబాబులను పంపెదరు.

"అదృష్టతాయెత్తు"

సర్వదోషముల నివారించి ప్రతిదానియందును అధృష్టమును కలిగించు అత్యద్భుత వింత తాయెత్తు రక్షరేకు కాదు, "కీకర్లా" అదృష్టపురుగు మీ చెడుగునకు బలిఅయి మీకు అదృష్టమును సమకూర్చును.

వివరములకు: కె.వి. రాఘవాచార్య
134 వెంకటాచల మొదలియారు వీధి,
రాయపేట పోష్టు, మదరాసు.